# ఆలుమగలు, ఆలుమగలే ?

**శ్రీ కాదంబరి వెంకటేశ్వర్రావు !**

"ఏమండీ......
మిమ్మల్లే...
మాట్లాడరేం...
చెవుడా ఏమిటి......

అబ్బ యిక నాకు స్వేచ్ఛలేదు గాబోలు. చూడండి వాళ్ల రుక్మిణమ్మగారు క్రిస్టమసులో మదరాసు వెడతారట మనంకూడా వెడదామా ? మాట్లాడరేం." అని చరచరా వంట యింట్లోకి చక్కాపోయింది సుశీల, "అలాగేలే యిప్పటునుంచీ యెందుకు ఆఘోష. ముందు వచ్చే క్రిస్టమస్కి యిప్పటునుంచీ ఎందుకు యీపీకులాట" అన్నాడు రాఘవరావు చొక్కాయి తొడుక్కుంటూ. "పాపము యిన్నాళ్లకు యీవాళ 'ఊ' అన్నారు. యీవాళ చాలామంచి రోజు, నిజముగా వెడదామా ! చూడండి వాళ్ల రుక్మిణమ్మగారు ఎంత స్వేచ్ఛగావుంటారో" అని సుశీల చరచరా భర్తను సమీపించింది. "చాల్లెద్దూ నడు భోజనముచేయి ముందుమాట ఆలోచిద్దాములే" అంటూ–రికార్డు తీసుకొని కోర్టుకి చక్కాపోయేడు రాఘవరావు, భర్తకేసి అదోవిధమైన కోపముతోటి చురచురా చూస్తూ లోనికి పోయింది సుశీల......

★

"ఉస్సు అబ్బా పాడు రోజులు ఎంతకష్టపడినా ఫలము దక్కదిలేదు. అరువు చాకిరీయేకాని కానీ యిచ్చేవాడు లేడు. విధిలేక చేయటముగాని" అనుచు సాయంత్రం కోర్టునుంచి రాగానే కుర్చీలో కూలపడ్డాడు రాఘవరావు. కొంచెము సేపు విశ్రాంతితీసుకొన్నాక "ఏమే ...ఏం...నిన్నే...పలుకవేం...ఏం చేస్తున్నావు నిరవాకము. చెంబుతో నీళ్లియ్యి. వంట అయిందా మాట్లాడవే...మొద్దూ"......అన్నాడు కోపముతోటి.

"ఆమొద్దునే అడగండి సమాధానము చెబుతుంది. మొద్దును అన్నారుకదూ ! నా ప్రారబ్ధము మూడినది కాబట్టి మీ బోటి భర్తలభించేరు. యీ అవమానాన్ని నే సహింపలేను" అంటూ "బోరుబోరున" ఏడ్వసాగినది సుశీల ఒకమూల పందిరి పట్టమంచము మీదపడుకొని. పాపము రాఘవరావు బెంబేల పడ్డాడు. శరీరము వనికింది. "యిదేమి కర్మమా దేవుడా" అనుకొన్నాడు. తక్షణం అమ్మగారి పాదాలచెంత ప్రత్యక్షం. అప్పుడు ఆమె ఏడుపు పటాపంచలైనది. పక్కున నవ్వింది. రాఘవరావు కొస్తశాంతినొంది "వంట అయినదా చంపేశావు...లే..." అన్నాడు. సమాధానము లేదు. మూతి బిగించి ముద్దరాలులా అదోవిధమయిన పెంకితనముతో కూర్చుంది. రాఘవరావుకి ఏమితోచింది కాదు...నీకేమి కావాలి ? నిన్ను ఎవరైనా అవమానించేరా ఏమిటి ? ఆమె అతిపెంకితనంతో "మరి క్రిస్టమస్కి మదరాసు" అంది. "యింతమాత్రానికే యింత అలక, వంటచేయి. రేపుతప్పకుండా వెడదాము," అని ఒట్టువేసుకున్నాడు. ఆమె, పట్టరాని సంతోషముతో భర్తవైపు ఒక క్రీగంటి చూపు విసరినది. రాఘవరావు తన్మయత్వము చెందేడు.

★

"సరిలేద్దూ అలాగే ఆ జాగా కాస్తా ఎవరేనా ఆక్రమిస్తారు పడుకుందూ......అయితే నా మాటవినరుగా నాకు స్వేచ్ఛలేదు గాబోలు. ఏమండీ ఏమంటారు" అంది సుశీల ఆదో విధమయిన కోపముతో......"ఆ మాటగాక యింకేమయినా అడుగు. నీ కోరిక తీరుస్తాను. ఏం నీకు స్వేచ్ఛ ఎందుకులేదు. చూడు...రేపు మెడ్రాసులో గుర్రపుపందేలు మొదలయినవి అన్నీ అవుతాయి. అప్పుడు హాయిగా మనము యిద్దరము చేయీచేయీపట్టుకొని షికారు వెడదాము. యింతకంటె ఏమికావాలి ?" అన్నాడు రాఘవరావు. "ఆ చాలావుంది స్వేచ్ఛ అలా కాదండి. నా చిన్ననాటి స్నేహితురాలు తెనాలిలో వుందండి. దాన్నిచూచి చాలాకాలము అయినదండి. ఒకసారి చూడాలనివుంది. ఒకసారి తెనాలిలో దిగుదామండి, మొన్న ఒకసారి మనవూరువచ్చినప్పుడు మరిమరీ చెప్పిందండి. ఏమంటారు"........అది మాత్రము నావల్ల కాదు. మనము మద్రాసు వెడుతున్నట్టుగా ఆమెకు ఏలా తెలుస్తుంది. పది గంటలు కావస్తోంది పడుకుందూ" అంటూ తనబిచాణా సర్దుకొనిపడుకున్నాడు రాఘవరావు. పాపము సుశీల చాలాదుఃఖించింది తన మాటనెరవేరనందుకు. "ఏమి నేను అడిగిన దానికి ఎందుకు సమాధానము యివ్వకపోవాలి" అనే కొత్తకొత్త భావాలు.

ఆమె మనసులో పరుగులెడుతున్నాయి. యిక ఆయనతో మాట్లాడకూడదనుకుంది. ఏలాగైనా తగిన శాస్తి చేయాలనుకుంది. ఆరైల్లో వాళ్లంతా తనను అవమానిస్తున్నారనుకొంది. యిక అవమానాన్ని సహింపలేక, తనబిచాణా తీసుకొని దూరముగాబోయి పడుకుంది.

★

“కాఫీ త్రాగుదువుగానిలే యిదిగో మెద్రాసు సమీపిస్తున్నాము” అని లేపేడు సుశీలను రాఘవరావు మరునాడు దయం. “చాల్లెండి నాతో మాట్లాడకండి, నా యిష్టమువచ్చిన తావుకి పోతాను. యిదే చెప్పటము. మీరు మాత్రము నాతో కూడావచ్చేరంటే రైలు క్రింద పడిచస్తా.” అని కోపంతో సుశీల తన సూటుకేసు చంకబెట్టు అతని జేబులోని టిక్కెట్టు తీసుకొని రాఘవారావుకేసి చురచురా చూస్తూ నిష్క్రమించింది. పాపము రాఘవరావు వెర్రి మొగము వేసేడు. ఏదో క్లిష్ట మసుకెన్నెవనుకదా సగము రేటుతోటే మెద్రాసు చూపించి వద్దామనుకున్నాడు. విలాసాని కనిపెట్టుకున్న ప్రయాణము వికటముగా మారింది. కథయీలా అడ్డము తిరుగుతుందని అనుకుంటే ప్రయాణము అప్పుడే మానివేద్దు. ఒక కూలీని కేకేసి సామానుపట్టించుకొని రైలుదిగేడు.

★

“అట్టే అట్టే అలానిలు” అన్నాడు గేటులోని నల్లదొర తెలిసీతెలియని తెలుగులోను, వుందాలేదన్న హిందీలోను, సరిగా తెలియని యింగ్లీషులోను. తెలుగు తప్ప మరేమీ తెలియని తెలుగుపడుచు సుశీల తెల్లమొగం వేసింది. అమట్టుగా అలాగే నిలబడిపోయింది విచారంతోటి. సమయానికే రాఘవరావు సమీపించిటిక్కెట్టు అందించేడు. “అలానడండి మీరిద్దరూ మాష్టరుగారి వద్దకు” అని తీక్ష్ణమైన చూపులతో అందీ అందరిని యింగ్లీషుతో. నాల్గుముక్కలు తెలిగించిజోడు చప్పుడు చేసుకుంటూ ముందునడిచేడు నల్లదొర. పాపము దంపతులు యిద్దరు తెల్లబోయిన ముఖాలతో మాష్టరు దగ్గరకు హాజరయ్యారు. మాష్టరుగారు యిద్దరి ముఖాలూ ఎగాదిగాచూచి “క్షమించండి అమ్మా ఆయ్యా మాతా బేదారు చాలా తెలివి తక్కువవాడు” అని పొమ్మని ఆజ్ఞాపించేడు. బ్రతుకు జీవుడా యని యిద్దరు యివతల పడ్డారు. టిక్కట్టు తారుమారయినా తిక్కత్తి మనసులు వేరువేరయినా ఎప్పటికైనా “ఆలుమగలు, ఆలుమగలే!”


స్త్రీ పురుషులను ఆనందముతో తనివి తీర్చుట కివియే

భూమండలములో మదించిన స్త్రీల గర్వభంగ మొనర్చుటకు

12 ఏండ్లనుండి ఋషిపుంగవునిచే కనిపెట్టబడి ప్రఖ్యాతిగన్నవి




ఇందు రసవిషాదులు చేర్చక కస్తూరి బంగారు హిమాలయ పర్వత వనమూలికలతో గొప్ప యోగీశ్వరులవద్ద గ్రహించి ముసలితనము లోకములో లేకుండజేయుటకు వీర్యపటుత్వము లేనివారికి లేపనశక్తి కలిగించుటకు సంతానప్రాప్తి లేని స్త్రీలకు పుత్రభిక్షు పెట్టుటకు ప్రయత్నించి ఈ మహాయోగ రాజము వెల్లడిచేయుట కవకాశము కలిగించితిమి. సందేహించక వాడితీరుడు, లేదా విచారించిన లాభమున్నదా? గుణములేనిచో డబ్బు వాపసుచేతుము. అరగంటలో వీర్యమును రాయివలెచేసి రమించుటకు ఉల్లాసము కలిగించి పురుషావయవములులావు, పొడవు, కలిగించి దృఢమై యెంతటి మదాంధురాలయినను వశ్యమై చేతులు జోడించి నమస్కరించునట్లు చేయుటలో పేరుపొందినది. వెలగల మందులయినను గవ్వకయిన పనికిరావు.

చూచెదరేల? కార్డు వ్రాయుడు. 30 మాత్రలు శాంపిల్సు రూ. 3-0-0.

బైరాగి చిటికి 60 మాత్రలు 5-0-0. క్యాటలాగు ఉచితం

**Apply to:—Dr. A. S. MURTHY, Chicacole.**